నవతెలంగాణ
1
ఆదిలాబాద్
సోమవారం | డిసెంబర్ 25, 2023 | www.navatelangana.com

ఆర్అండ్ఆర్ కాలనీని సందర్శించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-కాసిపేట



మండలంలోని దుబ్బగూడెం గ్రామానికి చెందిన సింగరేణి ఆర్అండ్ఆర్ కాలనీని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆర్అండ్ఆర్ కాలనీలో చేపట్టిన పనులను అడిగి తెలుసుకున్నారు. వెంటనే పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఎల్లవేళలా దుబ్బగుడెం గ్రామ ప్రజలకి అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రత్నం ప్రదీప్, గ్రామస్తులు బోగే రామకృష్ణ, శ్రీనివాస్, కమలాకర్, పులి శ్రీనివాస్, రామటెంకి రాజు, టింకు, మహేష్ పాల్గొన్నారు.

క్రిస్మస్ కానుకలు అందజేసిన ఎమ్మెల్యే వివేక్

నవతెలంగాణ-రామకృష్ణాపూర్



క్రిస్మస్ పురస్కరించుకొని పట్టణంలోని స్థానిక సీఎస్ఐ చర్చిని ఆదివారం చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి, బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్ సందర్శించి క్రిస్మస్ కానుకలను అందించారు. అనంతరం కేక్ కట్ చేసి క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వృద్ధ మహిళలకు చీరల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చర్చ్ ఫాస్టర్ జాషువా మెదక్ (డై సిసి), లే సెక్రెటరీ డోలకల డేవిడ్, కలువల శ్రీనివాస్, గుండమల్ల పుష్పరాజ్, ఆనంద్, ఐఎన్టీయూసీ యూనియన్ నాయకులు జనక్ ప్రసాద్, కాంపెల్లి సమ్మయ్య, తేజవత్ రాంబాబు, దేవి భూమయ్య, సంగ బుచ్చయ్య, కాంగ్రెస్ నాయకులు మహంకాళి శ్రీనివాస్, పలిగిరి కనకరాజు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా సీతక్క

నవతెలంగాణ-ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా దానసరి అనసూయ (సీతక్క)ను ప్రభుత్వం నియమించింది. ఇందుకు సంబంధించి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి జిల్లాలో ఆదివాసీ, గిరిజనులు అధికంగా ఉండటం.. వారితో మంచి సంబంధాలు కలిగి ఉండటం కారణంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది. మరో పక్క గతంలో ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అనేక సార్లు పర్యటించారు. జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులతో పాటు క్షేత్ర స్థాయిలో ప్రజలతోనూ సీతక్కకు మంచి పరిచయాలు ఉండటంతో పార్టీ బలోపేతానికి కూడా ఈమె నియామకం ఉపయోగపడుతుందని భావిస్తున్నారు. మరో పక్క ఇటీవలి తొలి విడత మంత్రి వర్గంలో ఉమ్మడి జిల్లాకు ప్రాతినిధ్యం దక్కలేదు. దీంతో సీతక్కను నియమించడం ద్వారా ఆలోటును కొంత వరకు భర్తీ చేయవచ్చని ప్రభుత్వం భావించినట్లు తెలిసింది. జిల్లా ప్రజల్లోనూ మంచి అభిమానం సంపాదించుకున్న సీతక్కను ఇన్‌చార్జి మంత్రిగా నియమించడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రేషన్‌కార్డులకు మోక్షం..!

- దరఖాస్తులు స్వీకరించే యోచనలో ప్రభుత్వం
- ఏండ్లుగా పడుతున్న తిప్పలకు పరిష్కారం
- ఈ నెల 28 నుంచి పల్లె చెంతకు అధికారులు
- ఉమ్మడి జిల్లాలో వేలాది మందికి ప్రయోజనం
- మంత్రివర్గ నిర్ణయంతో జనాల్లో హర్షం

పేదల జీవితాల్లో అత్యంత కీలకమైన రేషన్‌కార్డులకు త్వరలోనే మోక్షం లభించనుంది. కార్డులు లేక తొమ్మిదేండ్లుగా పడుతున్న బాధలకు పరిష్కారం దొరకనుంది. అర్హులందరికీ రేషన్‌కార్డులు జారీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించడం.. ఈ నెల 28 నుంచి పల్లెలు, వార్డుల వారీగా ప్రజాపాలన సభలు నిర్వహిస్తామని చెప్పడంతో జనాల్లో ఆశలు చిగురించాయి. ఈ సభల్లోనే రేషన్‌కార్డులకు సంబంధించి దరఖాస్తులు కూడా స్వీకరించే అవకాశం ఉండటంతో ఆశలు ఫలించనున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రభుత్వ నిర్ణయం కారణంగా ఉమ్మడి జిల్లాలో వేలాది మంది నిరుపేదలకు ప్రయోజనం కలుగుతుంది. ఇన్నాండ్లు రేషన్‌కార్డులు లేక వైద్యంతో పాటు బియ్యం, ఇతర ప్రభుత్వ పథకాలకు దూరమైన నిరుపేదలు తాజా నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు. వీటికి సంబంధించి విధివిధానాలు రూపొందించే పనిలో సర్కారు నిమగ్నమైంది. ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిన వెంటనే కార్యాచరణ ప్రారంభిస్తామని అధికారులు చెబుతున్నారు.



నవతెలంగాణ-ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ప్రభుత్వం ఏ పథకం ప్రవేశపెట్టినా వాటిని పొందాలంటే రేషన్‌కార్డు తప్పనిసరి. ప్రజల జీవితాలతో ముడిపడి ఉన్న ఈ కార్డుకు అత్యంత ప్రాధాన్యం ఉంటుంది. దేనికైనా ఈ కార్డులేనిదే పనికాని పరిస్థితి ఉంటుంది. ఇంతటి ప్రాధాన్యం కలిగిన రేషన్‌కార్డులను జారీ చేస్తామని గత ప్రభుత్వం పలుమార్లు చెప్పినా మాటలకే పరిమితమైంది. ప్రభుత్వం ఏర్పడిన కొత్తలో తెలంగాణ పేరిట పాత వాటి స్థానంలో కొత్త కార్డులను పునరుద్ధరించింది. కొన్ని కొత్త కార్డులను సైతం జారీ చేసినట్లు తెలిసింది. అది తప్పితే ఇప్పటి వరకు కార్డులు మంజూరుచేయడంలో నిర్లక్ష్యం ప్రదర్శించింది. ప్రజల్లో అప్పటి ప్రభుత్వంపై వ్యతిరేకత పెరిగేందుకు ఇది కూడా ఓ కారణమనే అభిప్రాయం వ్యక్తమైంది. ముఖ్యంగా ప్రభుత్వం పౌరసరఫరాలశాఖ ద్వారా ప్రతి నెల పంపిణీ చేస్తున్న పీడీఎస్ బియ్యాన్ని ఈ కార్డు ఆధారంగానే పంపిణీ చేస్తారు. కానీ చాలా మందికి ఈ కార్డులు లేకపోవడంతో బియ్యం పొందలేకపోతున్నారు. మరోపక్క ఆరోగ్యశ్రీతో పాటు వివిధ రకాల ప్రభుత్వ పథకాలకు సైతం ఈ కార్డు తప్పనిసరి కావడంతో వాటిని పొందలేకపోయారు. ముఖ్యంగా ఉమ్మడి కుటుంబాల నుంచి విడిపోయిన అనేక జంటలు కొత్త రేషన్‌కార్డులు పొందలేకపోవడంతో వారిలో తీవ్ర నిరాశ వ్యక్తమవుతోంది.

వేలాది మందికి ప్రయోజనం..!

ప్రభుత్వం జారీ చేయనున్న రేషన్‌కార్డులతో ఉమ్మడి జిల్లాలో వేలాది మందికి ప్రయోజనం కలగనుంది. గత ప్రభుత్వ హయాంలో 2021లో ఒకసారి రేషన్‌కార్డులకు దరఖాస్తులు స్వీకరించిన సమయంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 50వేల వరకు దరఖాస్తులు వచ్చాయి. ఆదిలాబాద్ జిల్లాలో 17,271, మంచిర్యాలలో 1800, కుమురంభీం ఆసిఫాబాద్‌లో 13,263, నిర్మల్‌లో 14,500 దరఖాస్తులు వచ్చాయి. అనంతరం మళ్లీ 2022లోనూ ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరించినా వాటిని అలాగే తొక్కిపెట్టింది. ప్రస్తుతానికి ఈ సంఖ్య మరింత పెరిగింది. ఒక్కో జిల్లా నుంచి 10వేల వరకు కొత్త దరఖాస్తులతో పాటు కొత్తగా పేర్లు చేర్చేవి కూడా చాలా వరకు ఉంటాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ కార్డులు జారీ అయితే ప్రభుత్వ పరంగా రావాల్సిన పథకాలను పొందేందుకు వీలుంటుంది. నూతన ప్రభుత్వం వీటిని జారీచేసేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ఈ నెల 28 నుంచి ప్రజా పాలన పేరిట గ్రామాలు, పట్టణాల్లోని వార్డుల్లో సభలు నిర్వహించేందుకు సిద్ధమవుతోంది. ఒక్కో రోజు రెండేసి గ్రామాల్లో అధికారులు పర్యటించి వివిధ రకాల పథకాలకు దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిసింది. ఆయా సంక్షేమ పథకాలకు సంబంధించి ప్రజల నుంచి వినతులు స్వీకరించి వాటిని పరిష్కరించే దిశగా చర్యలు చేపడుతారని ప్రభుత్వం వెల్లడించింది. వీటికి సంబంధించి విధివిధానాలు ఒకటి, రెండు రోజుల్లో వెల్లడయ్యే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో రేషన్‌కార్డుల కోసం దీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న నిరుపేదలకు ప్రయోజనం కలగనుంది.

అధికారికంగా ఆదేశాలు రాలేదు

కిరణ్‌కుమార్, డీఎస్ఓ, ఆదిలాబాద్

జిల్లాలో కొత్త రేషన్‌కార్డుల జారీకి సంబంధించి ప్రభుత్వం నుంచి అధికారికంగా ఎలాంటి ఉత్తర్వులు రాలేదు. రేషన్‌కార్డులకు సంబంధించి నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. సర్కారు నుంచి ఆదేశాలు రాగానే అవసరమైన కార్యాచరణ ప్రారంభిస్తాం.

బడుగు బలహీన వర్గాల పక్షాన నిలిచేది సీపీఐ



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

బడుగు బలహీన వర్గాల పక్షాన పోరాటాలు చేసే పార్టీ సీపీఐ అని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేని శంకర్, జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆదివారం సీపీఐ 99 ఆవిర్భావ వేడుకలను నిర్వహించి, మహిల నాయకురాలు పెండ్యాల కమలమ్మ, గాజుల మనెమ్మ కేక్ కట్ చేశారు. అనంతరం పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించి ముఖ్య కుడల్లలోని పార్టీ జెండాలు ఆవిష్కరించారు. అనంతరం కలవేని శంకర్, రామడుగు లక్ష్మణ్ మాట్లాడుతూ 1925 డిసెంబర్ 26న కాన్పూర్లో ఆవిర్భవించిన సీపీఐ ఆవిర్భవించినాడే దున్నే వారికి భూమి కావాలని పోరాటం చేపట్టినట్లు తెలిపారు. నాటి నుంచి నేటి వరకు బడుగు బలహీన వర్గాల పేద ప్రజల కార్మిక కర్షకుల కోరకు ఎన్నో పోరాటాలు చేసిన చరిత్ర కమ్యూనిస్టు పార్టీదని అన్నారు. దేశంలో కమ్యూనిస్టు పార్టీ పోరాటాల ఫలితంగా కార్మికుల కర్షకుల పక్షాన అనేక హక్కులను చట్టాలను తీసుకురావడం జరిగిందని, పాలక ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై నిరంతరం ప్రజల పక్షాన పోరాటాలు చేస్తూ బడుగు బలహీన వర్గాల ప్రజలకు అండగా కమ్యూనిస్టు పార్టీ నిలిచిందన్నారు. నాడు నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం చేసి దున్నేవాడికి భూమి కావాలి అని సుమారు పది లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచిన చరిత్ర కమ్యూనిస్టు పార్టీదని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి మిట్టపల్లి శ్రీనివాస్, జిల్లా సమితి సభ్యులు మిట్టపెల్లి పౌలు, వనం సత్యనారయణ, పేర్క సంపత్, కాదండి సాంబయ్య, ఏఐవైఎఫ్ నాయకులు ఈర వేణి రవీందర్, డిహెచ్పిఎస్ నాయకులు మారపెల్లి రవి పాల్గొన్నారు.

బీసీలకు 50 శాతం టికెట్లు కేటాయించాలి



నవతెలంగాణ-జన్నారం

వచ్చే ఎంపీ ఎన్నికల్లో బీసీలకు 50 శాతం టికెట్లు కేటాయించాలని బీసీ సంఘం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కన్వీనర్ కోడూరు చంద్రయ్య అన్నారు. ఆదివారం జన్నారంలో పత్రిక విలేకరులతో మాట్లాడారు. స్వతంత్రం వచ్చినప్పటి నుంచి బీసీలను రాజకీయంగా ఆర్థికంగా సాంఘికంగా ఎదగకుండా అణచివేస్తూ వస్తున్న కాంగ్రెస్ అలాగే బీజేపీ కూడా అదే దారిలో నడుస్తున్నాయి. రాష్ట్రంలో బీసీ ఉద్యమం తీవ్రంగా కొనసాగుతోందని అన్నారు. ఈ పరిస్థితుల్లో అన్ని పార్టీలు బీసీలకు టికెట్లు ఇస్తామని ప్రకటిస్తూ వచ్చిన విదంగా బీసీలకు 50 శాతం టికెట్లు కేటాయించడంలో కూడా పారదర్శకత ఉండాలని అన్నారు. దేశంలో ఉన్న 543 ఎంపీ స్థానాలలో 50 శాతం అంటే 270 ఎంపీ, టికెట్లు బీసీలకు ఇవ్వాలన్నరు. ఈ విషయాన్ని గ్రహించి రాష్ట్ర పార్టీల అధ్యక్షుడుగాని జాతీయ పార్టీ నాయకులు గాని గ్రహించి బీసీలకు 50 శాతం టికెట్లు కేటాయించవలసిందిగా బీసీ కులాల ఉద్యమ పోరాట సంఘం తరపున డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కేపే నర్సింహులు, కడార్ల నర్సయ్య, ఆడెపు లక్ష్మీనారాయణ, పిల్లి మల్లయ్య, కమ్మల రవి పాల్గొన్నారు.

అమ్మ ఒడి అన్నదానం



నవతెలంగాణ-తాండూరు

అమ్మ ఒడి ఎన్‌జీఓ అన్నదాత ప్రాజెక్టు, టెక్నో డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం నిర్వహించే అన్నదాన కార్యక్రమము విజయవంతం అయింది. 228వ వారాలు అన్నదాన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. బెల్లంపల్లి పట్టణంలో కాంట చౌరస్తా పల్లేటూరి బస్టాండ్ నందు యాచకులకు, నిరుపేదలకు, కూలీలకు, బాటసారులకు, సుమారు 200 మందికి అన్నదానం చేశారు. అమ్మ ఒడి అన్నదాత ప్రాజెక్టు వ్యవస్థాపకులు అజ్మీరా మోహన్ మంచిర్యాల జిల్లా బ్రాంచ్ మేనేజర్, టెక్నో డాన్స్ అకాడమీ గ్రాండ్ మాస్టర్ హనుమాండ్ల మధుకర్ మాట్లాడుతూ ఆకలితో ఉన్నవారికి ఆకలి తీర్చడం సంతోషాన్నిచ్చిందన్నారు. ఈరోజు దాతలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఒడి సభ్యులు హనుమాండ్ల సువర్ణ, రంగ సురేష్, లెంకల శ్రావణ్ కుమార్ (సన్నీయాదవ్), ఎండీ యూసుఫ్, చెందుపట్ల లింగమూర్తి, కామేర శివ పాల్గొన్నారు.

బీసీల హక్కుల కోసం ఉద్యమించిన పెరియార్

- మంచిర్యాలలో పెరియార్ 50వ వర్ధంతి సభ



పెరియార్ చిత్రపటానికి నివాళ్లు అర్పిస్తున్న బీసీ సంఘం నాయకులు

నవతెలంగాణ-హాజీపూర్

దేశంలో మెజార్టీ వర్గమైన బీసీలు, బడుగు వర్గాల హక్కుల కోసం వందేళ్ల క్రితమే మహా ఉద్యమం చేపట్టిన మహానుభావుడు పెరియార్ రామస్వామి నాయకర్ అని వివిధ బహుజన సంఘాల నాయకులు పేర్కొన్నారు. ఆదివారం మంచిర్యాలలోని బీసీ భవన్‌లో జరిగిన పెరియార్ 50వ వర్ధంతి సభలో వారు పాల్గొని ప్రసంగించారు. స్వార్థపూరిత శక్తులు సృష్టించిన మనువాద భావజాలానికి వ్యతిరేకంగా బడుగుల ఆత్మగౌరవ ఉద్యమాన్ని నడిపిన పెరియార్ 1927 లోనే బీసీలకు రిజర్వేషన్ హక్కును అందించాడని పేర్కొన్నారు. నాడు ప్రభుత్వ ఉద్యోగాల్లో బ్రాహ్మణులకు వంద శాతం రిజర్వేషన్ అమలయ్యేదని వారు తెలిపారు. బీసీలు ఎస్సీలు సైతం సమాజంలో భాగస్వాములేనని వారికి దక్కాల్సిన సామాజిక న్యాయం అందించాలని ఒంటరి పోరాటం నిర్వహించిన జననాయకుడిగా పెరియార్ నిలిచాడని తెలిపారు. పెరియార్ స్థాపించిన జస్టిస్ పార్టీ, ద్రవిడ కజగంల ఆధ్వర్యంలో బహుజనులు తమ న్యాయమైన హక్కుల కోసం ఉద్యమించారని అన్నారు. పెరియార్ చేసిన కృషి కారణంగానే 1960 ప్రాంతంలో బీసీ వర్గానికి చెందిన అన్నాదురై, కరుణానిధిలు తమిళనాడులో ముఖ్యమంత్రులు కాగలిగారని పేర్కొన్నారు. సమాన హక్కుల కోసం ఉద్యమించిన పెరియార్ బాటలో నేడు తమిళనాడు, కేరళలో అర్చక వృత్తిలో సైతం బీసీలు ఎస్సీలు అర్హత సాధించగలిగారని అన్నారు. పెరియార్ చూపిన ఆత్మాభిమాన ఉద్యమ ఆశయాన్ని బహుజనులు కొనసాగించాలని వారు పిలుపునిచ్చారు. బహుజనుల హక్కులను రద్దు పరిచి మనువాద వ్యవస్థను మళ్లీ తీసుకురావాలని మనువాద, మతోన్మాద శక్తులు ప్రయత్నిస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ ఐక్యవేదిక కన్వీనర్ వడ్డేపల్లి మనోహర్, సామాజిక న్యాయవేదిక కన్వీనర్ రంగు రాజేశం, సామాజిక ఉద్యమకారులు కామిల్ల జయరావు, కైరం జనార్దన్, మోతె రామదాసు, సుంక లక్ష్మణ్, సోమన్న భారత నాస్తిక సమాజం జిల్లా అధ్యక్షులు రాజసమ్ములు, మేరు సంఘం నాయకులు మాడిశెట్టి సత్యనారాయణ, కురుమ సంఘం జిల్లా నాయకులు సమ్ము రాజన్న, వేముల కిరణ్, మాల్యాద్రి, నారాయణ, బుర్ర వెంకటేష్, గోర్కటి సురేష్, కళ్యాణ్ పాల్గొన్నారు.

హక్కులు కాపాడుకోవడానికి ఏఐటీయూసీని గెలిపించాలి

నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి కార్మిక హక్కులు కాపాడుకోవడానికి, నూతన హక్కులు సాధించడానికి గుర్తింపు సంఘంగా ఏఐటీయూసీని గెలిపించుకోవాలని మైనింగ్ స్టాఫ్(ఏఐటీయూసీ) బెల్లంపల్లి రీజియన్ ఇన్‌ఛార్జి వంగరి రాజేశ్వరరావు, శ్రీరాంపూర్ ఏరియా ఇన్‌ఛార్జి మారపెల్లి బాపు, మందమర్రి ఇన్‌ఛార్జి గోపతి సత్యనారాయణ అన్నారు. ఆదివారం నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సింగరేణిలో మైనింగ్ స్టాఫ్‌కు విలువ లేకుండా పోయిందని, మైనింగ్ స్టాఫ్ ఏదైనా కారణం చేత మెడికల్ అన్ ఫిట్ అయితే సుటేబుల్ జాబ్ ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. అలాగే చార్జర్ లెవన్స్, క్యాడర్ స్కీమ్, ఉద్యోగ భద్రత కూడా లేదన్నారు. ఇవన్నీ హక్కులు సాధించుకోవాలంటే డిసెంబర్ 27వ తేదీన సింగరేణి గుర్తింపు ఎన్నికలలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) చుక్క గుర్తుకు ఓటు వేసి గెలిపించుకోవాలని కోరారు. ఏఐటీయూసీ గెలుపులో ప్రధాన పాత్ర వహించి, హక్కులు సాధించుకుంటామని అన్నారు. కార్యక్రమంలో బాలకృష్ణ, క్రాంతి కిరణ్, వెంకటేష్, చంద్రశేఖర్, సదయ్య పాల్గొన్నారు.

ప్రారంభమైన శివాలయ వార్షిక మహోత్సవం



నవతెలంగాణ-కౌటాల

మండలకేంద్రంలోని సదాశివ్‌పేట్ శివాలయం 50వ వార్షికోత్సవాలు ఆదివారం ఆలయ అర్చకులు అంబేద శంకరయ్య, అంబేద సంతోష్ ప్రారంభించారు. శివుడికి ఆరాధన, హారతి ఇచ్చి భాజాభజంత్రీలతో గ్రామదేవతల ఆరాధన నిర్వహించి, పార్వతి పరమేశ్వరుల పల్లకి సేవా హారతి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ వారోత్సవాలు మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్టు వారు తెలిపారు. సోమవారం ఉదయం శివుడి ఆరాధన, హారతి, అఖండ దీపారాధన, గణపతి పూజ, భక్తివచనం, నవగ్రహ ఆరాధన, పంచకలశ ఆరాధన, అంకురార్పణ, రుద్రాభిషేకం, ధ్వజారోహణ, మహా కుంభాబిషేకం, గణపతి హోమం, అగ్ని ప్రతిష్ఠ, హారతి, మంత్రపుష్పం, వీరభద్ర, భద్రకాళీ పూజలు, లక్ష దీపోత్సవ కార్యక్రమం, మహారుద్ర హోమం, అగ్నిగుండ భూమిపూజ, అగ్నిగుండ ప్రజ్వలన కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. 26న ఉదయం నాలుగు గంటలకు శివుడి ఆరాధన, ఐదు గంటలకు గురుపూజ, అగ్నిగుండ ప్రవేశం, హోమాల పూర్ణాహుతి, ఆశీర్వచనం నిర్వహించనున్నట్టు తెలిపారు. మూడు రోజుల పాటు కార్యక్రమంలో పాల్గొన్న భక్తులందరికి అన్నదాన కార్యక్రమం నిర్వహించబడుతుందని వారు తెలిపారు. భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కాగలరని వారు కోరారు.

అగ్ని ప్రమాద బాధితులను ఆదుకోవాలి

- మాలీ సంఘం మండల అధ్యక్షుడు కావిడే తులసిరాం



నవతెలంగాణ-కెరమెరి

ఖైరి గ్రామంలో శనివారం జరిగిన అగ్ని ప్రమాదంలో మూడు ఇండ్లు కాలి పోయి నిరాశ్రయులైన మూడు కుటుంబాలకు ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని మాలి సంఘం మండల అధ్యక్షుడు కావుడే తులసిరాం అన్నారు. ఆదివారం అగ్ని ప్రమాద బాధితులను కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్ని ప్రమాదంలో పండించిన పంట పత్తి పంటతో పాటు, నిత్యవసర సరుకులు ఇంటి నిర్మాణానికి ఉపయోగించిన విలువైన కర్ర, సామాగ్రి మంటల్లో పూర్తిగా ఖాళీ బూడిదైయినట్లు తెలిపారు. బాదిత కుటుంబాలకు ప్రభుత్వం తక్షణమే ఇండ్లుమంజూరు చేయాలన్నారు. రోడ్డున పడ్డ ఈ కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకొని న్యాయం చేయాలని కోరారు. అనంతరం మాలి సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో పోగుచేసిన రూ.11 వేలతోపాటు ఖైరి ఉప సర్పంచ్ శ్రీరామ్, గ్రామస్తులు చందుతో పాటు గ్రామస్తులంతా పోగు చేసిన రూ.97,000 వేల ఆర్థిక సహాయం అందించి ఔదార్యాన్ని చాటారు. ఈ కార్యక్రమంలో కోట్రంగే తిరుపతి, మాలీ సంఘం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గుర్తిపు సంఘం ఎన్నికల్లో విప్లవ సంఘాలను ఆదరించాలి

నవతెలంగాణ-నస్పూర్



సింగరేణి గుర్తింపు ఎన్నికలలో జాతీయ సంఘాలను విస్మరించి, విప్లవ సంఘాలను ఆదరించాలని విప్లవ సంఘాల నాయకులు అన్నారు. ఆదివారం నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ డిసెంబర్ 27న జరిగే ఎన్నికల్లో విప్లవ కార్మిక సంఘాలను బలపరిచే గోదావరిలోయ బొగ్గు గని కార్మిక సంఘం చక్రంలో సుత్తి గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కార్మికులను కోరారు. జాతీయ సంఘాల వలన వారసత్వ ఉద్యోగాలు పోయాయని ఆరోపించారు. గతంలో ఏఐటీయూసీ త్యాగాల చరిత్ర కానీ ప్రస్తుతం పాలకవర్గాలకు ఊడిగం చేస్తున్నాయని విమర్శించారు. ఎన్నికలు జరిగినప్పటి నుంచి ప్రశ్నించే గొంతులను నొక్కుతున్నారని, కోడ్ ఆఫ్ డిసిప్లిన్ రాజ్యాంగ వ్యతిరేకంగా ఉందని తెలిపారు. పర్మినెంట్ ఉద్యోగుల సంఖ్య గణనీయంగా తగ్గి, కాంట్రాక్ట్ వర్కర్ల సంఖ్య పెరిగిందని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో బీఆర్ఎస్ అధినేత కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేస్తామని హామీ ఇచ్చారని, 10 సంవత్సరాలు అధికారంలో ఉన్న పర్మినెంట్ చేయలేదని మండిపడ్డారు. జేబీసీసీ సంఘాలు కానీ, గుర్తింపు టీబీజీకేఎస్ కాని నిమ్మకు నీరు ఎత్తినట్లు వ్యవహరిస్తున్నారని అన్నారు. ఓసీపీలకు వ్యతిరేకమని తెలంగాణలో తమ ప్రభుత్వం భూగర్భగనులు ఏర్పాటు చేస్తామని చెప్పి, ఓసిపిలను పెంచి ఒక్క భూగర్భ గని కూడా తెరవ లేదన్నారు. సింగరేణి పరిరక్షణ కోసం, బొగ్గు బావల ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా, ఉద్యోగ భద్రత, వారసత్వ ఉద్యోగాల నియామకం కొరకు విప్లవ సంఘాలు పోరాటం చేస్తాయని పేర్కొన్నారు. విప్లవ సంఘాల వల్లనే హక్కులు సాధ్యపడతాయని అందుకే కార్మికులు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్టీయూ)జాతీయ ప్రధాన కార్యదర్శి టి శ్రీనివాస్, భారత కార్మిక సంఘాల సమాఖ్య(ఐఎఫ్టీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం శ్రీనివాస్, శ్రామిక శక్తి గోదావరి లోయ బొగ్గు గని కార్మిక సంఘం(ఎస్జీఎల్బికేఎస్-ఐఎఫ్టీయూ) రాష్ట్ర అధ్యక్షులు జి.రాములు, విప్లవ కార్మిక సంఘాల నాయకులు పోతుల కిష్టయ్య, తాళ్ల పెల్లి శ్రీనివాస్, మేకల రామన్న, కె విశ్వనాథ్, ఎం రాయమల్లు, ఎం పోషమల్లు, డి బ్రహ్మానందం, జి మల్లేష్, ఆర్ కాంతయ్య, ఎం మల్లన్న, డి శ్రీకాంత్, సారయ్య, రాజేష్, రాజులు పాల్గొన్నారు.

క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడుతాయి

నవతెలంగాణ-కౌటాల

క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడుతాయని ఎస్ఐ మధూకర్ అన్నారు. ఆదివారం మండలంలోని ముత్తంపేట గ్రామంలో ప్రీమియర్ లీజ్ పేరుతో గ్రామ పంచాయతీ పరిధిలో క్రికెట్ టోర్నమెంటును సర్పంచ్ ఆదె శ్రీనివాస్‌తో కలిసి ఎస్ఐ మధూకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు ఈర్ష్యాద్వేషాలు లేకుండా ప్రశాంత వాతావరణంలో క్రీడలు ముగించుకోవాలన్నారు. గెలుపోటములు సహజమని, ఓటమే గెలుపుకు నాంది అని అన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ దోని సురేఖ, ఉప సర్పంచ్ దుర్గం వెంకటేశ్ పాల్గొన్నారు.

నవతెలంగాణ
ఆదిలాబాద్
2
సోమవారం | డిసెంబర్ 25, 2023 | www.navatelangana.com

ఘనంగా ముగిసిన సప్తాహ వేడుకలు

నవతెలంగాణ-బేల

సద్గురు బ్రాహ్మలిన్ బాజీ రావ్ బాబా సప్తాహ, జ్ఞనేశ్వరి హరినామ సప్తాహ ముగింపు కార్యక్రమం బేల మండలంలోని పాఠన్ గ్రామంలో ఘనంగా నిర్వహించారు. సప్తాహను పురస్కరించుకొని స్థానిక హనుమాన్ ఆలయంలో కళశా ఘట స్థాపన చేసి సప్తాహను ప్రారంభించి వారం రోజుల పాటు సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. ముగింపు సందర్భంగా జ్ఞనేశ్వర్, నివృతి, సోపాన, ముక్తాబాయి దేవతా మూర్తుల వేశాదారణలో ఉన్న చిన్నారులను రథంపై ఉరేగించారు. ఈ సందర్భంగా శోభాయాత్ర అనంతరం దహిహండి కాళ, అన్నాదాన కార్యక్రమం నిర్వహించారు. దీంతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. వేడుకల్లో ఎమ్మెల్యే పాయల్ శంకర్ పాల్గొని పూజలు నిర్వహించారు. గ్రామస్తులు ఎమ్మెల్యేకు సాదరంగా స్వాగతం పలికి సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు విజయ్ భోయర్, మండల అధ్యక్షులు దత్త నిక్కం, స్థానిక సర్పంచ్ ఫైజుల్లా ఖాన్, గ్రామస్తులు ఉన్నారు.

సమీక్ష సమావేశానికి బోథ్ నాయకులు

నవతెలంగాణ-బోథ్



హైదరాబాద్‌లో నిర్వహించిన తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సమీక్ష సమావేశానికి బోథ్ నాయకులు వెళ్లారు. పార్లమెంట్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు నియోజకవర్గాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్ దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధి పసుల చంటి, నియోజకవర్గ మండలాల అధ్యక్షులు కళ్యాణం రాజేశ్వర్, కౌడాల నారాయణ, షేక్ ఇమామ్, శేఖర్, ఎంపీటీసీ కురుమే మహేందర్, మల్యాల కరుణాకర్, మల్లేష్ యాదవ్, గూడాల శేఖర్ పాల్గొన్నారు.

ఆలోచనలు..ఆవిష్కరణలు..!

- వివిధ నమూనాలతో విద్యార్థులు
- జనవరిలో రాష్ట్ర స్థాయి పోటీలకు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని సంజయ్ గాంధీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఇటీవల ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థులకు సృజన టెక్నికల్ ఫెస్టివల్‌ను నిర్వహించారు. ఆయా కళాశాలల్లోని వివిధ విభాగాల నుంచి విద్యార్థులు తాము తయారు చేసిన నమూనాలతో వచ్చారు. వీటిలోని కొన్ని నమూనాలు, వాటి తయారీ, ఉపయోగంపై విద్యార్థులు వివరించారు. కాగా ఈ ఫెస్టివల్‌లో జిల్లా స్థాయిలో ఎంపిక వారి వివరాలను వెల్లడించారు. ఇందులో కొందరి ప్రతిభ గుర్తించి వచ్చే నెలలో జరిగే రాష్ట్ర స్థాయి ఫెస్టివల్‌కు విద్యార్థులను పంపనున్నారు.

చేర్ కం లాడర్



విద్యార్థుల పేరు బ్రాంచ్: ఎం.మనోజ్, బి.ప్రభాకర్, సిహెచ్. బీరేష్, జి. విగ్నేష్, ఎస్. శ్రీనాథ్ (మెకానికల్)

కళాశాల: సంజయ్ గాంధీ ప్రభుత్వ పాలిటెక్నిక్, ఆదిలాబాద్.

గైడ్: బి.విజయలక్ష్మి, బి.ప్రవీణ్, మెకానికల్ ఇంజనీరింగ్ అధ్యాపకులు

ప్రాజెక్టు విశేషం: విద్యార్థులు తక్కువ ధర కలిగిన చెక్కతో స్థలం ఆదా చేసే విధంగా "చేర్ కం లాడర్" అనే కుర్చీ ప్రాజెక్టుని తయారు చేశారు. ఇంటి లోపల తక్కువ స్థలంలో ఫర్నిచర్ పట్టే ఉద్దేశంతో రూపొందించిన ఈ ప్రాజెక్టును కుర్చీతో పాటు నిచ్చెనగ కూడా ఉపయోగించవచ్చు. ఈ ప్రాజెక్టు కళాశాల స్థాయి మెకానికల్ ఇంజనీరింగ్ విభాగ పోటీలో మొదటి బహుమతి గెలుచుకుంది.

సృజన వెలికి తీసేందుకే ఫెస్ట్



విద్యార్థుల్లో ఉన్న సృజన వెలికితీసి సమాజానికి ఉపయోగపడే తక్కువ ధర పరికరాలను తయారు చేయటానికి సృజన టెక్ ఫెస్ట్ ఎంతగానో ఉపయోగపడుతుంది. విద్యార్థులు వారి డిప్లమా కోర్సుల్లో ఉపాధ్యాయులు, ఆన్‌లైన్ తాజా సమాచారం సహకారంతో నైపుణ్యం సాధించాలి.

-పి.భరద్వాజ, ప్రిన్సిపాల్, సంజయ్ గాంధీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆదిలాబాద్.

యాంటీ స్లీప్ అలారం టు ప్రివెంట్ యాక్సిడెంట్స్



విద్యార్థుల పేరు బ్రాంచ్: డి. సాయికిరణ్, హుజైఫ్ ఖాన్, ఏ.వంశీ, ఏ.విషి వర్ధన్ తేజ, ఏ.మేఘన, ఎం.పావని (ఈఈఈ)

కళాశాల : సంజయ్ గాంధీ ప్రభుత్వ పాలిటెక్నిక్, ఆదిలాబాద్.

గైడ్ : బి.జోత్స్నారాణి, లెక్చరర్ ఇన్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్.

ప్రాజెక్టు విశేషం: విద్యార్థులు తక్కువ ధర కలిగిన ఎలక్ట్రానిక్ సర్క్యూట్స్, కాంపోనెంట్స్, ఐసీ, రిలేసు, సెన్సార్సు, బ్యాటరీస్ ఉపయోగించి "యాంటీ స్లీప్ అలారం టు ప్రివెంట్ యాక్సిడెంట్స్" రూపొందించారు. ఈ పరికరం ప్రయాణంలో వాహన చోదకునికి నిద్ర వచ్చి కండ్లు మూసుకున్నప్పుడు వాహనం ఆటోమేటిక్‌గా వేగం తగ్గి ఆగిపోయేటట్లు చేస్తుంది. ఈ ప్రాజెక్టు జిల్లా స్థాయి సృజన టెక్నికల్ ఫెస్టివల్‌లో మొదటి బహుమతి పొందింది.

సోలార్ కార్ చార్జింగ్



విద్యార్థుల పేరు బ్రాంచ్: బి.వర్షిని, ఎస్. సాయి ప్రణవి, పి.శరత్, బి.అభినయ్, ఏ.గణేష్, ఎస్.సందేశ్ రెడ్డి (ఈఈఈ)

కళాశాల: ప్రభుత్వ పాలిటెక్నిక్, బెల్లంపల్లి.

గైడ్: పి.హరిత, లెక్చరర్ ఇన్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్.

ప్రాజెక్టు విశేషం: విద్యార్థులు ఇండక్షన్ కాయిల్, సెన్సార్ వంటి ఎలక్ట్రికల్ పరికరాలను ఉపయోగించి "సోలార్ కార్ చార్జింగ్" అనే ప్రాజెక్టుని తయారు చేసి ప్రదర్శించారు. ఈ పరికరం ఎలక్ట్రానిక్ వాహనం నడుస్తున్నప్పుడే బ్యాటరీని చార్జ్ చేసి సమయాన్ని ఆదా చేస్తుంది.

డిజైన్ అండ్ డెవలప్మెంట్ ఆఫ్ అగ్రి బోట్



విద్యార్థుల పేరు బ్రాంచ్: ఎం. విగ్నేష్, బి. జగదీష్, వి. ప్రణీంద్ర, పి. రిషిత, జె. జగదీష్, ఆర్. అనన్య (ఈఈఈ)

కళాశాల: ప్రభుత్వ పాలిటెక్నిక్ నిర్మల్.

గైడ్ : యాకూబ్, హెడ్ ఆఫ్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్.

ప్రాజెక్టు విశేషం: విద్యార్థులు తక్కువ ధర కలిగిన మైక్రో కంట్రోల్లోర్స్ డీ.పీ మోటార్స్, పంప్స్, భూమి తడి, సాంద్రత, ఉష్ణోగ్రత కొలిచే వివిధ రకాల సెన్సార్స్ వంటి వాటిని ఉపయోగించి "డిజైన్ అండ్ డెవలప్మెంట్ ఆఫ్ అగ్రి బోట్" అనే రోబోట్ ప్రాజెక్టుని రూపొందించారు. ఈ పరికరం వ్యవసాయంలో దున్నటం, విత్తనాలు వేయడం, నీటిని కావలసినంత సరఫరా చేయడం ద్వారా వ్యవసాయ కూలీల సమయం తగ్గించి రైతులకు లాభం చేకూరుస్తుంది.

4. ఫామ్ కనెక్ట్ హబ్.. వెబ్‌సైట్ సాఫ్ట్‌వేర్



విద్యార్థుల పేరు బ్రాంచ్: సిహెచ్. శ్రీతన్, నివాస్ గౌడ్, విష్ణువర్ధన్, దుర్గాప్రసాద్, దీక్షిత్ మణికుమార్ (సీఎస్ఈ)

కళాశాల: సంజయ్ గాంధీ ప్రభుత్వ పాలిటెక్నిక్, ఆదిలాబాద్.

గైడ్: జి. సుధాకర్, ఆర్. సంగీత, లెక్చరర్స్ ఇన్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్

ప్రాజెక్టు విశేషం: విద్యార్థులు హెచ్‌టీఎమ్ఎల్, సీఎస్ఎస్, జావా స్క్రిప్ట్, పైతాన్, ఎస్క్యూఎల్ వంటి సాఫ్‌వేర్‌ను ఉపయోగించి "ఫామ్ కనెక్ట్ హబ్" అనే వెబ్‌సైట్ సాఫ్ట్‌వేర్‌ను రూపొందించారు. ఈ వెబ్‌సైట్ ద్వారా రైతులకు వ్యవసాయంలోని ఆధునిక టెక్నాలజీని తెలియజేయడం, వ్యవసాయ యంత్రాలు, ఉపకరణాలను అద్దెకు తీసుకోవడం, నేల ఆరోగ్య తనిఖీ, పంట పర్యవేక్షణ, వాతావరణ సూచన, నిపుణుల సలహాలు, మార్గదర్శకత్వం అందుబాటులో ఉంటుంది. ఈ ప్రాజెక్టు కంప్యూటర్ విభాగంలో మొదటి బహుమతి గెలుచుకుంది.

క్రీడాకారులకు ప్రత్యేక శిక్షణ శిబిరాలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

నూతనంగా ఏర్పాడిన సంఘం ఆధ్వర్యంలో క్రీడాకారులకు ప్రత్యేక శిక్షణ శిబిరాలు నిర్వహిస్తామని ఆత్యాపాత్య సంఘం జిల్లా అధ్యక్షుడు, విద్యనగర్ కౌన్సిలర్ కలల శ్రీనివాస్ అన్నారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన పోటీల్లో క్రీడాకారులు జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. ఆదివారం క్రీడాకారులతో పాటు కోచ్ హరిచరణ్‌ను ఆయన శాలువతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కలల శ్రీనివాస్ మాట్లాడుతూ సంఘం ఆధ్వర్యంలో క్రీడాకారులకు ప్రత్యేక శిక్షణాలు అందించి రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించేల తయారు చేస్తామన్నారు. క్రీడాకారులు కూడా జిల్లాకు పేరు తీసుకువచ్చేల పోటీల్లో ప్రతిభ చాటాలన్నారు. ఈనెల 27 నుంచి 29వ వరకు పాండిచేరిలో జరిగే జాతీయ స్థాయిలో తెలంగాణ తరపున క్రీడాకారులు పాల్గొంటారని, అక్కడ కూడా విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి మేస్రం గణేష్, అజయ్, నవీన్, మజర్, జాషువ, శివ పాల్గొన్నారు.

ఏజెన్సీ ప్రాంతాలకు బస్సు సౌకర్యం కల్పించేలా కృషి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

త్వరలోనే ఆదిలాబాద్ నియోజకవర్గ పరిధిలోని ఏజెన్సీ ప్రాంతాలకు బస్సు సౌకర్యం కల్పించేలా కృషి చేస్తామని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. ఆదిలాబాద్ బస్టాండ్‌లో ఆదివారం జైనథ్ మండలంలోని లక్ష్మీపూర్ గ్రామానికి ఆర్టీసీ పల్లె వెలుగు బస్సు సౌకర్యాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్టీసీ అధికారులతో చర్చించి నియోజకవర్గంలోని బస్సు సౌకర్యం లేని గ్రామాలను గుర్తించడం జరిగిందన్నారు. ప్రజల విజ్ఞప్తుల మేరకు మరికొన్ని గ్రామాలకు విడతల వారీగా బస్సులను నడిపే విధంగా పాటుపడతామన్నారు. నిరంతరం ప్రజలకు సేవలు అందించే ఆర్టీసీ సంస్థను ఆదరించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రజా సంస్థ అయిన ఆర్టీసీని కాపాడుకోవాలన్నారు. మహాలక్ష్మి పథకం నేపథ్యంలో ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఆర్టీసీ అధికారులు అదనపు బస్సులను నడపాలని సూచించారు. ఆదిలాబాద్ ఆర్టీసీ అధికారుల పనితీరు బాగా ఉందని, ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. త్వరలోనే బేల మండలంలోని గూడ, మణియార్‌పూర్, కాంఫూర్ పూర్ గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం కల్పన, బీజేపీ నాయకులు, అధికారులు ఉన్నారు.

కిడ్స్ డ్రాయింగ్ కాంపిటీషన్‌కు విశేష స్పందన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పక్కా ఆదిలాబాద్, ఆదిలాబాద్ గాట్ టాలెంట్, సాగర్ సూపర్ మార్కెట్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కిడ్స్ డ్రాయింగ్ కాంపిటీషన్‌కు విశేష స్పందన లభించింది. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఆదిత్య కళాశాలలో ఈ కాంపిటీషన్ నిర్వహించగా దాదాపు 500 వందల మంది విద్యార్థులు పాల్గొన్నారు. ముందుగా జాతీయ గీతాలపన చేసి కాంపిటీషన్ ప్రారంభించారు. విద్యార్థులకు డ్రాయింగ్‌కు సంబంధించిన పేపర్, కలర్ పెన్సిల్ నిర్వాహకులు అందజేశారు. ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు గంట పాటు కాంపిటీషన్ జరిగింది. ఈ కాంపిటీషన్‌ను సాగర్‌తో పాటు జడ్జీలు ప్రశాంత్ కుమార్, పూర్ణ చందర్, రజిత పర్యవేక్షించారు. విద్యార్థులలో ఉన్న సృజనాత్మకతను, ప్రతిభను వెలికి తీయడానికి ఈ డ్రాయింగ్ కాంపిటీషన్‌ను నిర్వహించమని నిర్వాహకులు తెలిపారు. బెస్ట్ డ్రాయింగ్‌ను సెలెక్ట్ చేసి విజేతలను ప్రకటించి బహుమతులను ప్రధానం చేస్తామని, పాల్గొన్న ప్రతి విద్యార్థికి సర్టిఫికెట్ అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పక్క ఆదిలాబాద్ టీం సభ్యులు గాజరి శ్రీకాంత్, రవితేజ, గౌరవ్, వెంకటేష్, ఆదిలాబాద్ గాట్ టాలెంట్ టీం సభ్యులు జగత్, అరవింద్, నిధి, దివ్య పాల్గొన్నారు.

వినియోగదారుల కోసం అనేక చట్టాలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వినియోగదారుల కోసం అనేక చట్టాలున్నాయని, వాటి గురించి తెలియక నష్టపోతున్నారని కంజుమర్ రైట్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రమగిరి హరిబాబు అన్నారు. ఆదివారం నేషనల్ కంజుమర్స్ డేను ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక రైతు బజార్‌లో కేక్ కట్ చేసి వినియోగదారులకు ఉన్న హక్కులను తెలియజేశారు. ఈ సందర్భంగా కంజుమర్ రైట్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రమగిరి హరిబాబు మాట్లాడుతూ వినియోగారుల కోసం ప్రభుత్వాలు అనేక చట్టాలను కల్పించిందన్నారు. నకిలీ వస్తువులు, నాణ్యమైన, ఎంఆర్పీ కంటే ఎక్కువ ధరలకు విక్రయిస్తే ఎవరిని సంప్రదించాలన్న విషయాలు తెలియదన్నారు. వాటి గురించి తమ ఆర్గనైజేషన్ ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించి తెలియజేస్తామన్నారు. మోసపోకుండా నాణ్యమైన వస్తువులు ఎలా కొనుగోళు చేయాలో వివరిస్తామన్నారు. కార్యక్రమంలో మార్కెటింగ్ ఏడీ శ్రీనివాస్, తూనికలు కొలతల అధికారి నవీన్ రెడ్డి, సెక్టోరియల్ అధికారులు ఉదయ్ శ్రీ, సుజాత్, ఆర్గనైజేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శివకుమార్, జిల్లా అధ్యక్షుడు దొమ్మటి కిరణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి షేక్ ఇర్ఫాన్, ఉపాధ్యక్షుడు సురేందర్, గౌరవ అధ్యక్షుగు గడుగు గంగన్న, వర్కింగ్ ప్రెసిడెంట్ శివకుమార్ పాల్గొన్నారు.

ఉచిత ప్రయాణం.. బస్టాండ్‌లో తగ్గని రద్దీ



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

రాష్ట్రంలో నూతనంగా అధికారం చేపట్టిన కాంగ్రెస్ మహాలక్ష్మీ పేరిట మహిళాలకు ఉచిత ప్రయాణాన్ని కల్పించింది. నిత్యం బస్సుల్లో మహిళలు ప్రయాణం చేస్తున్నారు. పల్లెవెలుగుతో పాటు ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచితంగా ప్రయాణం ఉండడంతో వారు దీన్ని వినియోగించుకుంటున్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి మండల, జిల్లా కేంద్రాలకు పనుల నిమిత్తం వెళ్తున్నారు. ఏ బస్టాండ్‌లో చూసిన కూడా మహిళాలే అధికంగా కనిపిస్తున్నారు. ఆదివారం సెలవు రోజు సైతం ఇంద్రవెల్లి బస్టాండులో బస్సుల కోసం పిల్లపాపలతో ఎదురు చూస్తున్నారు. మరో వైపు ప్రైవేట్ వాహనాలు, ఆటోల వారికి గిరాకీ లేకుండ ఇబ్బందులు పడుతున్నారు. పథకం మంచిదైన పురుషులకు మాత్రం బస్సులో సీటు దొరకడం లేదు. గతంలో ఎవరి ఇంటికి వెళ్లాలన్న ఖర్చుల గురించి ఆడవారు ఆలోచిచే వారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటిలో ఉచిత ప్రయాణంతో సన్నిహితులు, బంధువుల ఇంటికి వస్తు పోతున్నారు. ఇదిలా ఉంటే కొందరు మహిళలు వివిధ పనుల నిమిత్తం ఒక్కరు పోవాల్సి ఉన్నకూడా ఉచిత ప్రయాణం కారణంగా ముగ్గురు, నలుగురు ప్రయాణం చేస్తున్నట్లు తెలుస్తోంది. రాబోయే రోజుల్లో పెళ్లిళ్ల సీజన్ ఉండటంతో సామాన్య ప్రజలకు బస్సుల కొరత తీవ్రంగా ఏర్పడ నుందని ప్రయాణికులు పేర్కొంటున్నారు. మరో పక్క ఆటోలు, ప్రయివేట్ జీపుల వారు మాత్రం తామకు ప్రత్యామ్నం చూపాలని కోరుతున్నారు.

ప్రజల పక్షాన నిలబడేది సీపీఐ



నవతెలంగాణ-తాంసి

బడుగుబలహీన వర్గాల పక్షాన నిలబడి పోరాటం చేసేది కేవలం సీపీఐ పార్టీయేనని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి అన్నారు. ఆదివారం భీంపూర్ మండలంలోని దనోరా, తాంసి మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో 99వ ఆవిర్భావ దినత్సవాన్ని పురస్కరించుకొని మండల నాయకులతో కలిసి ఎర్ర జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎర్ర జెండా పోరాటం ఫలితంగానే బడుగు బలహీన, కార్మిక, కర్షక కుటుంబాలలో చైతన్యం తీసుకువచ్చామన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల వల్ల నేటికి దేశంలో పేదరికంతో మగ్గుతుందని, యువత నిరుద్యోగ సమస్యలతో కాలం వెలదీస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రేండ్ల రతన్, సట్వాజి, అశోక్, దేవిదాస్, సతీష్, రమేష్, కుంటాల రాములు, సిర్ర దేవేందర్, భుమన్న, పోచ్చన్న, నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వినియోగదారులకు న్యాయమైన విద్యుత్ అందించడంలో విద్యుత్ ఉద్యోగుల పాత్ర కీలకమని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. ఆదివారం విద్యుత్ ఉద్యోగుల సంఘం 1104 యూనియన్ సభ్యులు ఎమ్మెల్యేను కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్చం అందజేసి సన్మానించారు. విద్యుత్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు విలాస్, ఉద్యోగులున్నారు.

జూనియర్ పంచాయతీ కార్యదర్శులు..

ఇటీవల నూతనంగా ఎన్నికైన ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్‌ను జూనియర్ పంచాయతీ కార్యదర్శుల యూనియన్ సభ్యులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి, పూల మొక్కను అందజేసి అభినందనలు తెలియజేశారు. జేపీఎస్‌ల సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు.



ఎమ్మెల్యేకు పుష్పగుచ్చం అందిస్తున్న జేపీఎస్ నాయకులు

ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్, సభ్యులు అరుణ్ రెడ్డి పాల్గొన్నారు.

డీసీసీబీ చైర్మన్ పదవికి రాజీనామా చేయాలి



మాట్లాడుతున్న బీఆర్ఎస్ యువ నాయకుడు సతీష్ పవార్

నవతెలంగాణ-బేల

బీఆర్ఎస్ పార్టీని వీడాలని నిర్ణయించిన డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి తన పదవికి కూడా రాజీనామా చేసి, తర్వాత పార్టీకి రాజీనామా చేయాలనీ బీఆర్ఎస్ యువ నాయకులు సతీష్ పవార్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాజీ మంత్రి జోగురామన్న కారణంగా ఎన్నో పదవులు అనుభవించి, ప్రస్తుతం పార్టీకి రాజీనామా చేయడం తగదని అన్నారు. నియోజకవర్గంలోని ప్రతి ఒక్క కార్యకర్త జోగురామన్న వెంటే ఉన్నారని స్పష్టం చేశారు. పదవులు పొందిన వారు పార్టీకి అండగా ఉండాల్సిన సమయంలో రాజీనామలు చేయడం సరికాదన్నారు. పదవికి రాజీనామా చేసిన తర్వాతనే పార్టీని వీడాలని అన్నారు. అడ్డి బోజా రెడ్డి వెనక ఏ ఒక్క కార్యకర్త లేరని, బీఆర్ఎస్, జోగు రామన్న సైనికుల్లాగా తామంతా పనిచేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు గంభీర్ ఠాక్రే, మండల అధ్యక్షులు కళ్లెం ప్రమోద్ రెడ్డి, జక్కుల మధుకర్, పీఏసీఎస్ బేల, డోప్టాల చైర్మెనులు పారట్కర్ బాలచందర్, ఖేదోడ్కర్ జితేందర్, నాయకులు దేవన్న, మస్కె తేజరావ్, గోడం సునీల్, మధుకర్ గోడే, సర్పంచులు వట్టిపెల్లి ఇంద్రశేఖర్, ఖోడే విపిన్, బాలేరావ్ మధుకర్ పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో రాణిస్తు జిల్లాకు మంచి పేరు తెవాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అథ్లెటిక్స్‌లో రాణిస్తు జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని, క్రీడాకారులకు సౌకర్యాలు కల్పించేల తమ వంతు సహకారం అందిస్తామని అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి అన్నారు. ఆదివారం ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 19వ నేషనల్ ఇంటర్ డిస్ట్రిక్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ ఎంపికను నిర్వహించారు. అండర్-14, 16 బాలబాలికలకు పోటీలు జరుగగా డీసీసీబీ చైర్మెన్ ముఖ్య అథితిగా హాజరై ప్రారంభించారు. అంతకు ముందు అథ్లెకిట్స్‌లో రాణిస్తున్న క్రీడాకారులను సత్కరించారు. ఈ సందర్భంగా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి మాట్లాడుతూ క్రీడాకారులు వారు ఎంచుకున్న రంగాల్లో రాణించాలన్నారు. వెనకబడిన ఆదిలాబాద్‌లో అథ్లెటిక్స్‌లో క్రీడాకారులు జాతీయ స్థాయిలో ప్రతిభ చాటడం అభినందనీయమన్నారు. క్రీడాకారులకు వసతులు, సౌకర్యాలు కల్పించేల తమ వంతుగా పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఎలాంటి సమస్యలున్న తమ దృష్టికి తీసుకురావలని సూచించారు. జిల్లా స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో మంచి ప్రతిభను కనబర్చి జిల్లా పేరును రాష్ట్ర వ్యాప్తంగా వినిపించాలన్నారు. అనంతరం అథ్లేటిక్స్‌లో ప్రతిభ కనబర్చిన క్రీడకారులను శాలువతో సత్కరించి



జెండా ఊపి పోటీలను ప్రారంభిస్తున్న డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి

అభినందనలు తెలిపారు. జాతీయ స్థాయిలో కూడా క్రీడాకారులు రాణించడం హర్షనీయమన్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారులను ఆదర్శంగా తీసుకుంటు ఇతర క్రీడాకారులు కూడా ఉన్నతంగా రాణించాలని సూచించారు. వారికి అసోసియేషన్ తరపున పూర్తి సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన క్రీడాలాభివృద్ధి అధికారి పార్థసారథి, అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి రాజేష్, పోటీల అబ్జర్వర్ శంకర్, డీసీసీబీ డైరెక్టర్ అశోక్ రెడ్డి, కోచులు సౌమ్య రాకేష్ ఉన్నారు.

నవతెలంగాణ 3
కుమురంభీం ఆసిఫాబాద్
సోమవారం | డిసెంబర్ 25, 2023 | www.navatelangana.com

గాలిపటాల పంపిణీ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

సంక్రాంతి పండుగను చిన్నారులు ఆనందోత్సవాల మధ్య నిర్వహించుకునేందుకు గాలి పటాలను పంపిణీ చేశారు. ఆదివారం మండలంలోని కొమ్ముగూడ గ్రామంలో బోనాల పండుగ పురస్కరించుకొని



చిన్నారులకు గాలిపటాలు పంపిణీ చేశారు. సాంప్రదాయాలు ఉట్టిపడేలా పండగ వేడుకలు సంబరంగా నిర్వహించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గడ్డల ప్రణయ్, గడ్డల కార్తిక్, జాడి విలాస్, గ్రామస్తులు గొనే గణేష్, గాడి సురేష్, మేకర్తి శంకర్, మామిడి శంకర్ పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు ట్రాక్టర్ దగ్ధం

నవతెలంగాణ- చింతలమానేపల్లి

మండల కేంద్రానికి సమీప పొలంలో ప్రమాదవశాత్తు ట్రాక్టర్ దగ్ధం ఆయన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు, ట్రాక్టర్ యజమాని వీరయ్య తెలిపిన వివరాల ప్రకారం.. విలాస్ సాగర్ సత్తయ్య పొలంలో వరి క్రేషర్‌తో వడ్లు నూర్పంగా ఒకసారిగా నిప్పురవ్వలు రగిలి మంటలో పూర్తిగా ట్రాక్టర్ దగ్ధమైనట్లు తెలిపారు. సమీపంలోనే వరిగడ్డ ఉండటంతో నిప్పురవ్వలు పడి సుమారుగా 10 క్వింటాళ్ల వరిధాన్యం కాలి బూడిదైంది. ట్రాక్టర్ విలువ రూ.8 లక్షలు ఉంటుంది. పై విషయంపై ఎస్సై సురేష్‌ను వివరణ అడుగగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



రేపు పుస్తక పరిచయ సభ

నవతెలంగాణ-అదిలాబాద్‌టౌన్

మళ్లీ మనిషిలోకి అనే పుస్తకపరిచయ సభను 26న నిర్వహిస్తున్నట్లు ప్రముఖ కవి ఉదారి నారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సైన్సెస్‌లో ఈ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి సభాధ్యక్షులుగా మధుసూదన్‌రావు, ముఖ్యఅతిథిగా సుమనస్పతిరెడ్డి, విశిష్ట అతిథి ముమ్మడి నరసింహారావు, ప్రధాన వక్తలు గోపగాని రవీందర్, కూకట్ల తిరుపతి హాజరవుతారని తెలిపారు. కవులు, రచయితలు, అందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

అధైర్య పడొద్దు.. ఆదుకుంటాం..

- రూ.20వేల ఆర్థిక సాయం అందజేత

నవతెలంగాణ-కెరమెరి

అధైర్య పడవద్దు అగ్ని ప్రమాదంలో నష్ట పోయిన బాధితులను అన్ని విధాలుగా ఆదుకుంటామని ఎమ్మెల్యే కోవ లక్ష్మీ అన్నారు. మండలంలోని ఖైరి గ్రామంలో శనివారం అగ్ని ప్రమాదంలో మూడు ఇల్లు దగ్ధమైన సంఘటన స్థలాన్ని పరిశీలించారు. అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయి కేవలం కట్టు బట్టలు మాత్రమే మిగిలాయని చంద్రయ్య, గిర్మాజీ, కమలబాయి ఎమ్మెల్యే ఎదుట బోరున విలపించారు. బాధితులను ఎమ్మెల్యే కోవ లక్ష్మీ పరామర్శించి, ప్రమాదం జరిగిన తీరును గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ధైర్యంగా ఉండాలని, తాము అండగా ఉంటామని భరోసానిచ్చారు. జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి మూడు కుటుంబాలకు రేకుల ఇండ్ల నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. అదేవిధంగా ప్రభుత్వం పరంగా సహాయ సహకారాలు అందేలా తన వంతు బాధ్యతగా కృషి చేస్తానన్నారు. అనంతరం క్వింటాల్ బియ్యంతో పాటు నిత్యావసర సరుకులు, బట్టలు, దుప్పట్లు, రూ.20 వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పెందూర్ మోతీరాం, జెడ్పీటీసీ సెడ్మకి ద్రుపత బాయి, వైస్ ఎంపీపీ సయ్యద్ అబుల్ కలాం, స్థానిక సర్పంచ్ లెన్గూరే విజయ లక్ష్మి బాలాజీ, సాంగ్వి సర్పంచ్ తొడసం జగన్నాథ్ రావు, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రాథోడ్ ఉత్తం నాయక్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పెందూర్ ఆనంద్‌రావు, మాజీ ఎంపీటీసీ గోగర్ల రాజయ్య, ఖైరి ఉపసర్పంచ్ శ్రీరాం, గ్రామస్తులు చందు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం శ్రద్ధ తీసుకోవాలి

నవతెలంగాణ-అదిలాబాద్ టౌన్

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యల పరిష్కారానికి నూతన ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల చిన్నన్న అన్నారు. ఆదివారం సీఐటీయూ అనుబంధ తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ సమావేశాన్ని సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించారు. కార్మికుల సమస్యలు, బడ్జెట్, వేతనాలు తదితర విషయాలపై చర్చించారు. అనంతరం నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డిలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల చిన్నన్న మాట్లాడుతూ గత ప్రభుత్వం విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహారం కార్యక్రమం చేపట్టిందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి అల్పాహారం కేవలం ఫోటోలకే పరిమితం అయిందని చెప్పారన్నారు. దీనిపై విధివిధానాలకు కమిటీ వేస్తామని చెప్పారన్నారు. గుడ్డుకు ప్రత్యేక బడ్జెట్‌తో పాటు యూనిఫాం, వంటశాలలను నిర్మించాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో సమస్యల సాధనకు ఉద్యమిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బండి దత్రాత్రి, మధ్యాహ్న భోజన కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

నవతెలంగాణ-కౌటాల

మండల కేంద్రంలోని నదిమాబాద్‌కు చెందిన మోర్ల సకారం ఇటీవల రోడ్డు ప్రమాదంలో చనిపోయారు. ఆ కుంటుంబం పెద్ద దిక్కును కోల్పోయింది. దీనిపై స్పందించిన ఎస్సై మధుకర్ మృతుని భార్య స్రవంతికి రూ.5వేల ఆర్థిక సాయం అందజేసి, మానవత్వం చాటుకున్నారు. ఒక నెలకు సరిపడా ఆహార వస్తువులు బియ్యం, పప్పులు, నూనె అందించి వారిని ఆదుకున్నారు. ఎస్సై మధుకర్‌ను మండల వాసులు అభినందించారు.

రేపు ఉచిత ఆరోగ్య పరీక్షల శిబిరం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

సీఎస్‌సీ హెల్త్‌కేర్ ఆధ్వర్యంలో ఈ నెల 26న కాగజ్‌నగర్ పట్టణంలోని బాలభారతి ఉన్నత పాఠశాలలో ఉచిత ఆరోగ్య పరీక్షల శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఖజా వసీమొద్దీన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం తొమ్మిది గంటలకు నిర్వహించే ఈ శిబిరంలో పలు రోగ నిర్ధారణ పరీక్షలు చేయనున్నట్లు తెలిపారు. 18 సంవత్సరాలు పైబడి ఉండి, ఆధార్‌కార్డు కలిగిన ప్రతీ ఒక్కరూ ఈ శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహించుకోవచ్చని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

కరాటే, కుంగ్‌ఫులో మంచిర్యాల క్రీడాకారుల ప్రతిభ

నవతెలంగాణ-నస్పూర్

ఇంటర్ స్టేట్ లెవెల్ కరాటే అండ్ కుంగ్‌ఫు ఛాంపియన్‌షిప్-2023(బీఎంఆర్ కప్-2023) టోర్నమెంట్‌లో మంచిర్యాల జిల్లాకు చెందిన క్రీడాకారులు ప్రతిభ కనబర్చారు. ఆదివారం పెద్దపెల్లి జిల్లాలోని పల్లవి మోడల్ స్కూల్‌లో జరిగిన కరాటే, కుంగ్‌ఫులో క్రీడాకారులు పీ.రితేష్, ఎం.సాయి ఈశ్వర్, కే.నిహారిక, ఏ.మన్యు, జి.ఆమన కార్తికేయ, ఎస్.మనీష్ గోల్డ్ మెడల్ సాధించగా, ఏ.సాయి అక్షిత్, జె. శ్రేయన్స్‌రెడ్డి సిల్వర్ మెడల్ సాధించినట్టు కరాటే మాస్టర్ పోచంపల్లి వెంకటేష్ తెలిపారు.

రైతుబంధు, పెన్షన్లు విడుదల చేయాలి

- ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి అల్లెపు పీటర్

నవతెలంగాణ-ఖానాపూర్

రాష్ట్రంలో రైతులందరికీ రైతుబంధును ఖాతాల్లో వెంటనే జమ చేయాలని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి అల్లెపు పీటర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. యాసంగి పంటకు విత్తనాలు, ఎరువులు, కొనుగోలు చేయడంతో రైతులు విసిగిపోతున్నారనీ తెలిపారు. ప్రభుత్వాన్ని మార్చిన తరుణంలో ప్రభుత్వం ఊగేసలాట సరైంది కాదని తెలిపారు. ఏది ఏమైనా రైతు రుణమాఫీ మొదటి సంతకం అన్న ముఖ్యమంత్రి ఇప్పటికైనా ఆలోచించి రుణమాఫీ పడేవిధంగా చూడాలని పేర్కొన్నారు.

శివాలయంలో షష్టి బోనాలు

నవతెలంగాణ-బెజ్జూరు

మండలంలోని అందుగులగూడ శివమల్లన్న స్వామి గుట్ట వద్ద ఆదివారం భక్తులు షష్టి బోనాలు నిర్వహించారు. శివమల్లన్న స్వామి గుట్ట వద్ద స్వయంభుగా వెలిసిన శివాలయంలో మండలంలోని ఊడ్సరంగపల్లి, సులుగుపెల్లి, కుంటలమానేపల్లి, అందుగులగూడ తదితర గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తమ మొక్కులు తీర్చుకున్నారు.

సీపీఐ(ఎం) ప్లీనరీ సమావేశాలకు వేళాయే

- కార్మిక, కర్షక వర్గాలకు అండగా కమ్యూనిస్టుల ఎజెండా
- నేడు జిల్లా కేంద్రంలో సమావేశం
- హాజరుకానున్న రాష్ట్ర ప్రముఖులు

కార్మిక, కర్షక వర్గాల ప్రజలకు బాసటగా నిలుస్తూ, వారి సమస్యలే ప్రధాన ఎజెండాగా కమ్యూనిస్టులు ముందుకు సాగుతున్నారు. ప్రజల కోసమే అహర్నిశలు శ్రమిస్తూ ప్రజల్లోనే నిరంతరం ఉండేవారు. వారి జెండా ఎజెండా పూర్తిగా ప్రజల కోసం అంకితమై పనిచేయడమే, సమాజంలో సమస్యలపై నిరంతర పోరాటమే వారి ఎజెండాగా ముందుకు సాగుతూ భవిష్యత్తు కార్యచరణకు సిద్ధమవుతున్న జిల్లా శ్రేణులు నేడు ప్లీనరీతో తమ కార్యచరణ ప్రకటించనున్నారు.

నవతెలంగాణ-ఆసిఫాబాద్



నేడు జిల్లా కేంద్రంలో ప్లీనరీ సమావేశం..

సీపీఐ(ఎం) ప్లీనరీ సమావేశం జిల్లా కేంద్రంలోని రోజ్ గార్డెన్‌లో జరుగనుంది. భవిష్యత్తు కార్యాచరణ ప్రకటనలో భాగంగా ప్లీనరీ జరుగనున్న నేపథ్యంలో ప్రాధాన్యత సంతరించుకుంది. జిల్లాలో పార్టీ స్థితిగతులు, చేయాల్సిన మార్పులు తదితరాంశాలు ప్లీనరీలో చర్చకు రానున్నాయి. పార్టీ అభివృద్ధి కోసం ఎటువంటి చర్యలు చేపట్టాల్సి ఉంటుందని చర్చించనున్నట్లు తెలిసింది.

పాల్గొనున్న ప్రముఖులు..

జిల్లా కేంద్రంలో నేడు నిర్వహించనున్న ప్లీనరీలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎస్.వీరయ్యతో పాటు రాష్ట్ర కమిటీ సభ్యుడు బండారి రవికుమార్ సమావేశంలో పాల్గొనున్నారు. జిల్లా శ్రేణులకు దిశానిర్దేశం చేయనున్నారు.

ప్రజా సమస్యలే ప్రధాన ఎజెండా..

ప్లీనరీలో ప్రజా సమస్యల ప్రధాన ఎజెండాగా ఉండనుంది. ప్లీనరీకి సంబంధించి ఇప్పటికే జిల్లా కేంద్రంలో పార్టీ శ్రేణులు ప్రధాన కూడళ్లలో జెండాలు కట్టి ఏర్పాట్లు పూర్తి చేశారు. పట్టణంలోని ప్రధాన కూడళ్లు ఎర్ర రంగు జెండాతో రెపరెపలాడుతున్నాయి.

ప్లీనరీకి అన్ని ఏర్పాట్లు పూర్తి

ప్లీనరీకి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ఈ ప్లీనరీకి జిల్లా నాయకత్వంతో పాటు రాష్ట్ర ముఖ్యనాయకులు హాజరు కానున్నారు. ప్రజా సమస్యలే ప్రధాన ఎజెండాగా సమావేశం జరుగనుంది.

దుర్గం దినకర్, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు

సీఐటీయూ ఎన్నికల ప్రచార రథం ప్రారంభం



నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో శ్రీరాంపూర్ లోని ఆఫీస్ నుంచి ఎన్నికల ప్రచారంలో భాగంగా కార్మిక కుటుంబాలను, కార్మికులను చైతన్య పరుస్తూ సీఐటీయూను గెలిపించడానికి చైతన్య రథాన్ని ఆదివారం ప్రారంభించారు. అలాగే 12 గ్యారంటీలను ఇంటింటి ప్రచారం చేయటానికి ముఖ్యఅతిథులుగా సింగరేణి కాంగ్రెస్ ఎంప్లాయిస్ యూనియన్‌కు అడ్వైజర్, సీఐటీయూ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్ జెండా ఊపి ప్రచార రథాన్ని ప్రారంభించారు. శ్రీరాంపూర్ ఏరియాలోని నాగార్జున కాలనీలో సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మిక కాలనీలా సమస్యలను తెలుసుకుంటూ, 27న జరిగే ఎన్నికల్లో సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ఉదయించే సూర్యుడు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరుతూ ప్రచారం నిర్వహించారు. కార్మిక వార్డులలో ప్రచారం నిర్వహిస్తున్నప్పుడు ముఖ్యంగా కాలనీవాసులందరూ కాలనీలలో పరిశుధ్య వ్యవస్థ సరిగ్గా లేదని, మంచినీరు తాగలేక మినరల్ వాటర్ కొనుక్కొని తాగుతున్నామని తెలిపారు. కార్మిక కాలనీల్లో రోడ్లు సరిగా లేవని వర్షాకాలంలో దోమల బెడద ఎక్కువగా ఉన్న కనీసం ఫాగింగ్ కూడా చేయడం లేదని పలు రకాల ఇబ్బందులను నాయకుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఇప్పటివరకు గెలిచిన సంఘాలు అటు కార్మిక సమస్యలను గానీ కార్మిక వాడల్లోని సంక్షేమాన్ని సైతం పట్టించుకోకుండా కేవలం పైరవీలు చేసుకుంటూ జేబులు నింపుకున్నారని అన్నారు. ఈ సమస్యలను పట్టించుకోలేదని ఈసారి సీఐటీయూ ఉదయించే సూర్యుడు గుర్తుకు ఓటు వేసి గెలిపిస్తే స్థానిక సమస్యలపై సైతం పరిష్కరిస్తామన్నారు. ఇప్పటికే గోదావరి ఖనిలో కార్మిక వాడల్లో పర్యటించి సమస్యలు తెలుసుకొని పోరాటం వలన మినరల్ ప్లాంట్లు, గ్రావిటీ ప్లాంట్‌లో ఏర్పాటు చేయడానికి యాజమాన్యం ఒప్పుకొని నిధులు పూర్తిగా లేక కొన్ని నిధులు మాత్రమే విడుదల చేశారని తెలిపారు. ఈసారి సీఐటీయూ గెలిస్తే తప్పనిసరిగా కార్మిక కాలనీల సమస్యలను పరిష్కరించేందుకు యాజమాన్యంతో కలిసి కార్మిక వాడలను అధికారులు సందర్శించే సమస్య ప్రత్యక్షంగా వారు చూసేలా చేసి పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు అధ్యక్ష కార్యదర్శులు గుల్ల బాలాజీ, గోదారి భాగ్యరాజ్, ఆర్గనైజర్ వెంగళ శ్రీనివాస్, ఉపాధ్యక్షులు కస్తూరి చంద్రశేఖర్, డివిజన్ నాయకులు సాయిల శ్రీనివాస్, ఆవునూరు మహేష్, శ్రీనివాస్, పెరక సదానందం, శ్రీపతి బానేష్, ఇందారం 1ఏ శ్రీనివాస్, సుధాకర్ పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంలో సింగరేణి అగ్రస్థానం

- ఆవిర్భావ వేడుకల్లో జీఎం దేవేందర్



నవతెలంగాణ-రెబ్బెన

దక్షణ భారతావనికి వెలుగులు అందిస్తూ సింగరేణి సంస్థ తమ కర్తవ్యాన్ని నెరవేర్చుకుంటుందని బెల్లంపల్లి ఏరియా జీఎం జి.దేవేందర్ పేర్కొన్నారు. సింగరేణి 134వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం గోలేటిలోని భీమన్న మైదానంలో ఏర్పాటు చేసిన ఆవిర్భావ వేడుకలను జీఎం ప్రారంభించారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు జీఎంతో పాటు వేడుకల్లో పాల్గొన్నారు. ఉదయం తొమ్మిది గంటలకు జెండాను ఆవిష్కరించి సింగరేణి తల్లి విగ్రహాన్ని జీఎం ఆవిష్కరించారు. సాయంత్రం ఏడు గంటలకు 134వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో కేక్‌ను కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం జీఎం డి.రవిప్రసాద్ మాట్లాడుతూ దేశంలోనే అత్యధిక వనరులు, సాంకేతిక పరిజ్ఞానంలో సింగరేణి అగ్రస్థానంలో ఉందన్నారు. కొత్త ప్రణాళికలతో ముందుకెళ్లడం, వనరులను సద్వినియోగం చేసుకుంటూ అత్యుత్తమ సంస్థగా అభివృద్ధి చెందడానికి కార్మికులు, అధికారులు, యూనియన్ నాయకుల కృషి ఎనలేనిదని పేర్కొన్నారు. సంస్థ అత్యధిక లాభాలను అందిస్తూ పరిసర ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. సేవా సమితి ఆధ్వర్యంలో ఎన్నో స్వయం ఉపాధి కోర్సులు ప్రవేశపెట్టి నిరుద్యోగ యువతకు ఉపాధి బాటలు వేస్తున్నట్టు పేర్కొన్నారు. రక్షణతో కూడిన ఉత్పత్తికి దోహదపడుతుందని, బెల్లంపల్లి ఏరియాకు నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.

ఆకట్టుకున్న స్టాళ్లు...

మైదానంలో 18 స్టాళ్లను ఏర్పాటు చేయగా ఖైరిగూడ ఓసీపీ స్టాల్స్ విభాగాన్ని జీఎం దేవేందర్ ప్రారంభించారు. యంత్రాల పనితీరును ఆయన పరిశీలించారు. సీహెచ్‌పీ స్టాల్‌ను, ఎంవీటీసీ స్టాల్‌ను ఎస్ఓటు జీఎం మచ్చగిరి నరేందర్ ప్రారంభించారు. ఆస్పత్రి స్టాల్‌ను ఏరియా ఇంజనీర్ తిరుమలరావు ప్రారంభించారు. సేవా స్టాల్స్‌ను, జాబ్ స్టాల్స్‌ను పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి ప్రారంభించారు. మైదానంలో ఏర్పాటు చేసిన జలకన్య, సింగరేణి తల్లి శవల్, ట్రైర్లు ఆకర్షనీయంగా అందరిని ఆకట్టుకున్నాయి. సినీ ఫీల్డ్ నుంచి ఈ కార్యక్రమానికి నాజర్ హాజరై ఆయన ప్రసంగించారు. ఈ వేడుకల్లో పాల్గొనడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నానన్నారు. మారుమూల గ్రామమైన గోలేటిలోని ఇంత ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉండటం నాకెంతో సంతోషాన్ని కలిగించిందన్నారు. అంతేకాకుండా సినీ ఫీల్డ్‌లోని బాహుబలి సినిమాలోని ఒక డైలాగును చెప్పడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.

అంబరాన్నింటిన సంబరాలు...

బెల్లంపల్లి ఏరియా గోలేటిలోని శ్రీ భీమన్న మైదానంలో ఆదివారం రాత్రి సింగరేణి ఆవిర్భావ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. సేవా సమితి ఆధ్వర్యంలో మహిళలు బోనాలు, బతుకమ్మలతో ఆకట్టుకున్నారు. అంతేకాకుండా సింగరేణి కార్మికులలో ఉత్తమ కార్మికులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. కార్యక్రమంలో సింగరేణి అధికారులు, కార్మికులు పాల్గొన్నారు.

'సమస్యలపై స్పందించని మాజీ ఎమ్మెల్యే'

నవతెలంగాణ-కాగజ్‌నగర్

రిటైర్డ్ ఆర్మీ అసోషియేషన్ పక్షాన తమ సమస్యల కోసం మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప చుట్టూ తిరిగి వేసారి పోయామని, ఏనాడూ తమ సమస్యల పరిష్కారం కోసం చొరవ చూపలేదని రిటైర్డ్ ఆర్మీ అసోషియేషన్ అధ్యక్షులు కె శివకుమార్ ఆరోపించారు. ఆదివారం స్థానిక శిశుమందిర్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన అసోసియేషన్ త్రైమాసిక సమావేశంలో ఆయన మాట్లాడారు. అసోసియేషన్ భవన నిర్మాణం కోసం మూడు గుంటల భూమి, అమరవీరుల స్థూపం కోసం స్థలం కోసం స్థలం కేటాయించాలని ప్రస్తుత ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబును కోరినట్లు తెలిపారు. ఆయన సానుకూలంగా స్పందించారని, త్వరలోనే తమ సమస్యలకు పరిష్కారం చూపుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షులు పాపయ్య ప్రధాన కార్యదర్శి సునీల్ మండల్, ఆర్గనైజింగ్ సెక్రటరీ వినాయక చాప్లె, జాయింట్ సెక్రటరీ రమాకాంత్ యాదవ్, ట్రెజరర్ శివప్రసాద్, సభ్యులు దిలీప్ సర్కార్, రాజేష్ గోష్, తారపద మండల్, శివ పదమండల్, అజయ్ మిశ్రా, డి శ్రీనివాస్, అనురోద్‌సింగ్ పాల్గొన్నారు.



గిరిజనులకు దుప్పట్ల పంపిణీ

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ మండలంలోని మండ్వ, కొత్త అనుకోడ, అనుకోడ గ్రామాలలో ఆదివారం ప్రేరణ ఫౌండేషన్, సహృదయ ఫౌండేషన్‌ల ఆధ్వర్యంలో పేద గిరిజనులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రేరణ ఫౌండేషన్ చైర్మెన్ శరత్ సుదర్శి మాట్లాడుతూ ప్రస్తుతం చలి విపరీతంగా ఉన్నందున పేద గిరిజనులు ఈ చలి ధాటికి అల్లాడుతున్నారని, వారి బాధలు గుర్తించి దుప్పట్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. దీనికి సహకరిస్తున్న సహృదయ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు బిందు తాడవాకకు ధన్యవాదాలు తెలిపారు. డీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు దుర్గం విస్తారు మాట్లాడుతూ పేదలను ఆదుకునేందుకు స్వచ్ఛంద సంస్థలు మరింతగా ముందుకు రావాలని అన్నారు. సామాజిక కార్యకర్త మహేష్ దుర్గె మాట్లాడుతూ ప్రేరణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న పేద విద్యార్థులకు ఉచితంగా ట్యూషన్లు చెప్పించడంతో పాటు పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. నిరుద్యోగ మహిళలకు కుట్టు మిషన్లు, విస్తరాకుల తయారీపై శిక్షణ ఇప్పిస్తున్నామని అన్నారు. ఈ ఫౌండేషన్‌కు దాతలు ఆర్థికంగా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వినోద్‌కుమార్, బలరాం, రవీందర్, మాజీ సర్పంచ్ పుల్యానాయక్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు పెన్‌గంగలో పడి ఒకరు గల్లంతు

నవతెలంగాణ-సిర్పూర్(టి)

ప్రమాదవశాత్తు పెన్‌గంగలో పడి ఒకరు గల్లంతైన సంఘటన మండలంలోని టోంకిని గ్రామ సమీపంలోని పెన్‌గంగలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చింతలమానెపల్లికి చెందిన చౌదరి మారుతి(50) ప్రమాదవశాత్తు పడి గల్లంతయ్యాడు. చౌదరి మారుతి తన కుటుంబం బోనాల పండుగ సందర్భంగా గంగ స్నానానికి వచ్చి ప్రమాదవశాత్తు పడి గల్లంతైనట్టు, గల్లంతైన వ్యక్తి కోసం గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపడుతున్నట్టు ఎస్సై దీకొండ రమేష్ తెలిపారు.

గోలేటి రిజర్వాయర్ ఆయకట్టు రైతులను ఆదుకోవాలి

నవతెలంగాణ-రెబ్బెన

గోలేటి రిజర్వాయర్ మరమ్మతులు చేపట్టి ఆయకట్టు రైతులను ఆదుకోవాలని, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కేసరి ఆంజనేయులు గౌడ్ అన్నారు. ఆదివారం మండలంలోని గోలేటిలోని రిజర్వాయర్‌ను బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కేసరి ఆంజనేయులుగౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు గుల్బం చక్రపాణి, మాజీ ఉపసర్పంచ్ గుగ్లోత్ రవినాయక్ పరిశీలించారు. రిజర్వాయర్ కాలువ తెగిపోయి, మరొక కాలువ గేటు ఊడిపోయిందని అన్నారు. దానిని మరమ్మత్తులు చేయకపోవడంతో రైతుల చేన్లకు నీల్లు రాక గత రెండు ఏండ్లుగా రైతులు భూములు బీడ్లుగా మారాయని, రైతులు పంటలు పండించలేకపోతున్నారన్నారు. పంట చేన్లు బీడుగా ఉండటంతో భూమాఫియా నాయకులు రైతుల భూములను ఆక్రమించుకుంటున్నారన్నారు. కాలువలకు మరమ్మత్తులు చేయాల్సిన బాద్యులు స్థానిక సర్పంచ్ పోటు సుమలత శ్రీధర్‌రెడ్డి, ప్రజా ప్రతినిధులు, మండల అభివృద్ధి అధికారులు, జిల్లా ఇరిగేషన్ అధికారులు రైతులను పట్టించుకోకపోవడం, మరమ్మత్తులు చేయకపోవడం ఎంతో బాధకలిగిన విషయమని అన్నారు. దీనివల్ల రైతులు చాలా నష్టపోతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు వెంటనే స్పందించి గోలేటి రిజర్వాయర్ కాలువకు మరమ్మత్తుల చేసి ఈ ఖరీఫ్‌కైన అందించి, రైతులను ఆదుకోవాలని, రైతులకు ఈ రెండు ఏండ్ల కాలానికి ఎకరానికి రూ.20 వేల నష్ట పరిహారం ప్రభుత్వం అందించాలన్నారు. వెంటనే కాలువకు మరమ్మత్తులు చేసి పంటలకు నీల్లు అందించాలని అధికారులకు ఆయన విజ్ఞప్తి చేశారు. లేనిపక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గిరిజన మోర్చా జిల్లా కార్యదర్శి లావుడ్య హరిలాల్ నాయక్, గోలేటి పట్టణ ప్రధాన కార్యదర్శి ఎర్ర రాజేష్, ఆడెపు నరేష్, ములుకుట్ల వెంకటేశ్, నాయకులు పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకలకు ముస్తాబైన చర్చీలు

నవతెలంగాణ-ముధోల్

క్రిస్మస్ పండగ సందర్భంగా నియోజకవర్గ కేంద్రమైన ముధోల్‌తో పాటు, మండలంలోని తరోడా, ఎడ్‌బిడ్, వెంకటపూర్ తదితర గ్రామాల్లో చర్చీలు అందంగా ముస్తాబయ్యాయి. సోమవారం నిర్వహించే క్రిస్మస్ వేడుకలను ఘనంగా జరుపుకునేందుకు క్రైస్తవులు ఏర్పాట్లు చేశారు. చర్చిలను రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు.

కాసిపేటలో..

బెల్లంపల్లి, సోమగూడెం రహదారి మధ్యలోని కల్వరీ చర్చిలో క్రిస్మస్ వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. వేడుకల కోసం చర్చిని అందంగా అలంకరించారు. ఈ ప్రాంతంలో అతి పెద్ద చర్చి కల్వరీ కావడంతో అధిక సంఖ్యలో క్రైస్తవులు తరలిరానున్నారు. ప్రతి ఏడాది 50 రోజుల పాటు ప్రవీణ్ పాస్టర్ చేసే ఉపవాస దీక్షల కార్యక్రమం ఇక్కడ ప్రత్యేకత చాటుకున్నది. దీక్షల ముగింపు సభ భారీ స్థాయిలో నిర్వహిస్తారు. దేశ నలుమూలల నుంచి ఇక్కడికి వచ్చి ప్రార్థనలు చేస్తారు. అందరూ సుబిక్షంగా ఉండాలని, కలిసి మెలిసి ఉండాలని ప్రత్యేక ప్రార్థనలు చేయనున్నట్లు పాస్టర్ ప్రవీణ్, సిస్టర్ షారోన్ తెలిపారు. అందరికి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

లక్షెట్టిపేటలో..

క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని లక్షెట్టిపేట పట్టణంలోని పలు చర్చీలు అందంగా ముస్తాబయ్యాయి. సోమవారం నిర్వహించే ఏసు క్రీస్తు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు క్రైస్తవులు ఏర్పాట్లు చేస్తున్నారు. సేవే క్రీస్తు మార్గమని, ప్రేమ ఏసు తత్వమని పలువురు క్రైస్తవ మత ప్రబోధకులు బోధిస్తున్నారు. లక్షెట్టిపేట ప్రెస్బిటర్ ఇన్‌చార్జీ ఎస్.డేవిడ్‌పాల్ ఆధ్వర్యంలో లక్షెట్టిపేటలోని పురాతన సీఎస్ఐ చర్చి, సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఈ సందర్భంగా అందరూ క్రిస్టమస్ పండుగను సంతోషంగా జరుపుకోవాలని కోరారు. అందరికీ ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే పట్టణంలోని పలు చర్చీలు కూడ విద్యుత్ దీపాలతో అత్యంత సుందరంగా అలంకరించారు.

కాగజ్‌నగర్‌లో..

క్రిస్మస్ వేడుకలకు కాగజ్‌నగర్ పట్టణంలోని పలు చర్చీలు ముస్తాబయ్యాయి. చర్చీలను లోపల, బయటా విద్యుత్ దీపాలతో అలంకరించారు. పట్టణంలోని సీఎస్ఐ, ఫాతిమా, యుసీసీ చర్చీలతో పాటు ఇతరత్రా చర్చీలను కూడా సుందరంగా తీర్చిదిద్దారు. ఆయా చర్చీల ఫాదర్‌లు క్రిస్మస్‌ను పురస్కరించుకొని ప్రత్యేక ప్రార్థనలు చేపట్టనున్నారు.

మొక్కులు చెల్లించిన సాయి దీక్షాపరులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

సాయిబాబా మాలధారణ స్వీకరించిన దీక్షాపరులు ఆదివారం మొక్కులు చెల్లించారు. జిల్లా కేంద్రంలోని సాయిబాబా ఆలయంలో ఆలయ ప్రధాన అర్చకుడు మధుకర్ శర్మ ఆధ్వర్యంలో ఇరుముడి కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా నవగ్రహ, గణపతి, శ్రీ సాయిబాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఇరుముడిని దునిలో వేశారు. స్వాములు భక్తిశ్రద్ధలతో చేసిన శరణు ఘోషతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. ఈ కార్యక్రమంలో గురు స్వాములు సిరిపురం భద్రయ్య, తిరుపతి, సునీల్, స్వాములు, సురేష్, అన్వేష్, మహేష్, దయాసాగర్, అనిల్, రవి, దేవిదాస్, గొల్ల, సంతోష్, రమేష్, మారుతి, కళ్యాణ్ పాల్గొన్నారు.

దత్త ఆశ్రమంలో రుద్రాభిషేకం

నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని ప్యారమూర్ గ్రామంలో నిర్వహించిన దత్త బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం శ్రీ నర్మదేశ్వర స్వామికి లఘు రుద్రాభిషేకం నిర్వహించారు. సాయంత్రం గురుదత్త, సాయిబాబా, అవధూత నందస్వామి మందిరాల్లో హారతినిచ్చారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దత్తసాయి భక్తులు గ్రామస్తులు పాల్గొన్నారు.